సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 17 । జూలై । 2023



సర్కారు వైద్యం.. పేదలకు వరం

వై.రామవరం ప్రభుత్వాస్పత్రిలో అధునాతన వైద్యసేవలు అందుబాటులోకి రావడంతో ప్రజలకు వరంలా మారింది.

8లో




టమాటాలతో తులాభారం

అనకాపల్లి గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయంలో వినూత్నరీతిలో తులాభారం నిర్వహించారు.

8లో

శాకంబరిగా..



అనకాపల్లి నూకాంబిక అమ్మవారు భక్తులకు శాకంబరి దేవిగా దర్శనమిచ్చారు. ఆషాఢమాసం పురస్కరించుకుని అమ్మవారిని కూరగాయలతో అలంకరించారు.

న్యూస్‌రీల్

వరద సహాయక చర్యలపై నేడు సమీక్ష

వీఆర్‌పురం: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈరోజు (సోమవారం) మధ్యాహ్నం 3 గంటలకు వరద సహాయక చర్యలపై సమీక్ష నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ ఎస్.శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వరదల సమయంలో చేపట్టాల్సిన సహయక చర్యలపై సమావేశంలో చర్చిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, సిబ్బంది పూర్తి సమాచారంతో హాజరు కావలని ఆయన సూచించారు.

చికిత్స పొందుతూ బాలింత మృతి



రామలక్ష్మి మృతదేహం

రాజవొమ్మంగి: మండలంలోని లోతట్టు ప్రాంతం లోదొడ్డి గ్రామానికి చెందిన బాలిత బుటారి రామలక్ష్మి (30) బాలింత కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. వివరాలిలాఉన్నాయి. జడ్డంగి పీహెచ్‌సీలో ఏప్రిల్ 3వ తేదీన రామలక్ష్మి మగశిశువుకు జన్మనిచ్చింది. అప్పటి నుంచి తల్లీబిడ్డ ఆరోగ్యంగానే ఉన్నారని వైద్యాధికారి సుజి తెలిపారు. ఈనేపథ్యంలో గతనెల 6వ తేదీన లోదొడ్డిలో జరిగిన ఫ్యామిలీ ఫిజీషియన్ ఉచిత వైద్య శిబిరంలో రామలక్ష్మి ఆరోగ్యం బాగోలేదని గుర్తించామని ఆమె పేర్కొన్నారు. కాళ్లు చేతులు వాపు రావడంతో వెంటనే కాకినాడ జీజీహెచ్‌కు రిఫర్ చేసినట్టు ఆమె వివరించారు. రామలక్ష్మికి కిడ్నీ, లివర్ పనిచేయడం లేదని వైద్యపరీక్షల ద్వారా గుర్తించిన అక్కడి వైద్యులు చికిత్స ప్రారంభించారు. అయితే ఆమె చికిత్స పొందుతూ మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. ఆమెకు నలుగురు సంతానం. వారంతా దిక్కు కోల్పోయారు.

చాపరాయి వద్ద సండే సందడి



చాపరాయి జలపాతానికి వచ్చిన పర్యాటకులు

డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతానికి మైదాన ప్రాంతం నుంచి పర్యాటకులు భారీగా తరలివచ్చారు. దీంతో సందడి వాతావరణం నెలకొంది. ఐదు నెలల తరువాత పెద్ద ఎత్తున పర్యాటకులు తరలిరావడం ఇదే మొదటి సారి అని స్థానికులు తెలిపారు. చిరు వ్యాపారులు మంచి ఆదాయం పొందారు.

గాలికొండ వ్యూపాయింట్ వద్ద..



వ్యూపాయింట్ వద్ద పర్యాటకులు

అరకులోయ రూరల్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయ,అనంతగిరి ఘాట్ రోడ్డులోని గాలి కొండ వ్యూపాయింట్ వద్ద పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవు కావడంతో అధిక సంఖ్యలో తరలివచ్చారు. గత కొదిరోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు చల్లని వాతావరణం నెలకొంది. మంచు సోయగాలు కమ్ముకున్నాయి. ప్రకృతి అందాలు కనువిందు చేస్తుండటంతో తిలకించేందుకు పర్యాటకులు కుటుంబ సమేతంగా తరలివస్తున్నారు.

గంజాయి కేసులో పరారైన నిందితుడి అరెస్టు



పట్టుబడిన గంజాయి నిందితుడితో అరకు సీఐ రుద్రశేఖర్,ఎస్ఐ సంతోష్‌కుమార్

డుంబ్రిగుడ: గంజాయి కేసులో పరారైన ఒడిశాకు చెందిన పతలంగి పంచాయతీ చంపపుట్టు గ్రామానికి చెందిన కృష్ణచంద్ర దురు(28)ను ఆదివారం పట్టుకున్నట్టు సీఐ రుద్రశేఖర్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన వివరాలు వెల్లడించారు. 2022లో నమోదైన గంజాయి కేసులో ఐదుగురు నిందితుల్లో ముగ్గురిని అప్పటిలో అరెస్టు చేయగా మిగతా ఇద్దరు పరారీలో ఉన్నారు. వీరిలో ఒకరైన కృష్ణచంద్ర దురును గాలించి పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. పరారీలో ఉన్న మరో వ్యక్తిని త్వరలో పట్టుకుంటామని ఆయన వెల్లడించారు. ఎస్ఐ సంతోష్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ ఆర్‌కే కేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రకృతి సొగసు చూడతరమా!



అరకు సమీపంలో కనువిందు చేస్తున్న పచ్చదనం



వ్యూపాయింట్ సమీపంలో మంచు అందాలు

అరకులోయ పరిసరాల్లో ప్రకృతి అందాలు కనువిందు చేస్తున్నాయి. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎటుచూసినా పచ్చదనంతో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. ఈ ప్రాంతానికి వచ్చే సందర్శకులు ఈ అందాలను తిలకించి మధురానుభూతి పొందుతున్నారు. – అరకులోయ రూరల్

గోదావరి నీటిమట్టం తగ్గుముఖం

దేవీపట్నం: రెండు రోజుల నుంచి పెరుగుతూ వచ్చిన గోదావరి నీటిమట్టం శనివారం రాత్రి నుంచి తగ్గుముఖం పట్టింది. ఆదివారం సాయంత్రానికి రెండు అడుగుల మేర తగ్గింది. ఇదేవిధంగా తగ్గదల కొనసాగితే సోమవారం నాటికి పూడిపల్లి పంచాయతీలోని గండిపోశమ్మ అమ్మవారి ఆలయంలో వరద నీరు తొలగిపోయే అవకాశం ఉందని స్థానికులు తెలిపారు. ప్రస్తుతం ఆలయానికి దండంగి వైపునుంచి వెళ్లే మార్గం వరదనీటిలో చిక్కుకుంది. వరదనీరు రోడ్డుపైకి వచ్చేయడంతో రాకపోకలు నిలిచిపోయాయి. భక్తులెవరూ ఆలయానికి రావొద్దని ఇప్పటికే అధికారులు కోరారు. అమ్మవారి దర్శనం ఎప్పుడు కల్పించేది తెలియజేస్తామన్నారు.

2 రోడ్లు.. 120 గ్రామాలకు
మహర్దశ



అభివృద్ధి చెందనున్న పందిరిమామిడి- చవిటిదిబ్బలు రోడ్డు

రోడ్ల నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు లభించనుండటంతో సుమారు 120 గ్రామాల గిరిజనుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఇప్పటికే పందిరిమామిడి- చవిటిదిబ్బల రోడ్డులో 10 కిలోమీటర్ల నిర్మాణానికి ఆమోదం లభించడంతో పనులు ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాకవాడ- ఆకూరు రోడ్డు నిర్మాణానికి కూడా త్వరలో మోక్షం లభించనుంది. ఈ రోడ్ల సమస్య పరిష్కారంపై ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ప్రధాన దృష్టి సారించారు.

- ఇప్పటికే పందిరిమామిడి- చవిటిదిబ్బలు రోడ్డుకు అటవీశాఖ అనుమతి
- త్వరలో కాకవాడ- ఆకూరు రోడ్డు నిర్మాణానికి ఆమోదం
- ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి కృషితో పరిష్కారం కానున్న శాశ్వత సమస్య

రంపచోడవరం: ఏజెన్సీలో అటవీశాఖ అనుమతిలేక నిలిచిపోయిన రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించేందుకు రోడ్లు భవనాలశాఖ, గిరిజన సంక్షేమశాఖ ఇంజినీరింగ్ అధికారులు చర్యలు చేపట్టారు.. ఈ సమస్యపై రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్, అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. త్వరలోనే గ్రామాలను అనుసంధానం చేస్తూ తారురోడ్డు సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.

మూడు మండలాలను కలిపే రోడ్డుకు..

ఏజెన్సీ ప్రధాన కేంద్రం రంపచోడవరాన్ని అనుసంధానం చేసే పందిరిమామిడి- చవిటిదిబ్బలు రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేపట్టారు.రోడ్లు భవనాలశాఖ పరిధిలోని ఈ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.24 కోట్లు మంజూరు చేసింది. ఈనిధులతో పందిరిమామిడి-చవిటిదిబ్బలు 30 కిలోమీటర్ల రోడ్డులో 20 కిలోమీటర్లు పూర్తి చేశారు. అనేక చోట్ల కొండ కాలువలపై కల్వర్టులు నిర్మించారు. పది కిలోమీటర్ల మేర రోడ్డు అటవీ ప్రాంతంలో ఉన్నందున ఆశాఖ అనుమతి లేకపోవడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఈ మార్గంపై ఆధారపడిన మారేడుమిల్లి, రంపచోడవరం, వై.రామవరం మండలాలకు చెందిన సుమారు 100 గ్రామాలకు గిరిజనులకు రవాణా సేవలకు ఆటంకం ఏర్పడింది.

ప్రభుత్వం దృష్టికి సమస్య..

ఏజెన్సీలో అటవీ అభ్యంతరాలతో నిలిచిపోయిన పందిరిమామిడి-చవిటిదిబ్బలు రోడ్డు పరిస్థితిని ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. అటవీశాఖ నుంచి అనుమతి వచ్చేలా కృషి చేశారు. దీంతో నిలిచిపోయిన పది కిలోమీటర్లు పనులు వచ్చేనెల మొదటి వారంలో ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి ప్రత్యామ్నాయంగా అడవిని అభివృద్ధి చేసేందుకు రోడ్డు భవనాలశాఖ అధికారులు ఇప్పటికే సుమారు రూ.కోటి నిధులు అటవీశాఖకు చెల్లించారు.

కాకవాడ-ఆకూరు రోడ్డుకు..

రంపచోడవరం మండలంలోని కాకవాడ-ఆకూరు రోడ్డు నిర్మాణానికి కూడా అటవీ అభ్యంతరాలు తొలగిపోనున్నాయి. రూ. 11 కోట్ల వ్యయంతో తొమ్మిది కిలోమీటర్లు మేర రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. ఈ నిర్మాణం పూర్తయితే సుమారు 20 గ్రామాల గిరిజనులకు మెరుగైన రవాణా సౌకర్యం ఏర్పడుతుంది. ఇన్నాళ్లకు వారి కష్టాలు గట్టెక్కనున్నాయి.

పనుల ప్రారంభానికి సన్నద్ధం

పందిరిమామిడి- చవిటిదిబ్బలు రోడ్డు నిర్మాణ పనులు ఆగస్టు మొదటి వారంలో ప్రారంభించేందుకు సన్నద్ధమవుతున్నాం. ఈ రోడ్డుకు ఎంతో ప్రాధాన్యం ఉంది. అనేక గ్రామాల గిరిజనులు రంపచోడవరం చేరుకునేందుకు ఇది దగ్గర దారి. పనులు ప్రారంభించేందుకు అన్ని చర్యలు చేపట్టాం.

– ప్రదీప్, జేఈ, రోడ్లు భవనాల శాఖ రంపచోడవరం

వ్యాపారి కిడ్నాప్ కలకలం

- రూ.5.50 లక్షలు తీసుకుని విడుదల చేసిన కిడ్నాపర్లు
- ఇద్దరు నిందుతుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన సీఐ రాంబాబు



కిడ్నాప్ చేసిన ఇద్దరు నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టిన సీఐ రాంబాబు, ఎస్ఐ అప్పలరాజు



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న నగదు

అడ్డతీగల : డబ్బులకు ఆశపడి హోమ్‌నీడ్స్ వ్యాపారిని కిడ్నాప్ చేసి రూ.5.50 లక్షలు గుంజిన ఇద్దరు యువకులను పోలీసులు పట్టుకుని కటకటాల వెనక్కి నెట్టారు.అడ్డతీగలలో సంచలనమైన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను సీఐ వై.రాంబాబు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆదివారం వెల్లడించారు. జగ్గంపేటకు చెందిన ఒనుము సుబ్బారావు కొన్నేళ్లుగా అడ్డతీగలలో జయదేవి హోమ్‌నీడ్స్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. గృహోపకరణాలను అరువుపై విక్రయించి వారానికి ఓమారు నగదు వసూలు చేస్తుంటారు. దీనిలో భాగంగా ఈ నెల 12న జల్లూరు గ్రామానికి వసూళ్లకు వెళ్లిన సుబ్బారావు తిరిగి వస్తుండగా దుప్పులపాలెం సమీపాన అడ్డతీగల మండలం డి.భీమవరం ప్రాంతానికి చెందిన అయినల్లి రాజీవ్‌కుమార్ అలియాస్ బంగారం, అతని అన్న కొడుకు అయిన అయినల్లి భానుకుమార్ అటకాయించారు. అతని చేతులను నైలాన్ తాడుతో వెనక్కి కట్టి కిలోమీటర్ మేర నడిపించి తీసుకెళ్లారు. రూ.25 లక్షలు ఇవ్వాలని లేకుంటే చంపేస్తామని బెదిరించారు.అంత డబ్బు తన వద్ద లేదని భార్యకు ఫోన్ చేసి ఇంటివద్ద ఇతర స్నేహితుల వద్ద రూ.5.50 లక్షలు నగదు తెప్పించి ఇచ్చిన తరువాత తెల్లవారుజాము ప్రాంతంలో సుబ్బారావును విడిచిపెట్టారు. అడ్డతీగల వచ్చిన అతను పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కిడ్నాప్‌చేసి నగదు గుంజిన ఇద్దరు యువకులు రాజీవ్‌కుమార్, భానుకుమార్‌ను దుప్పులపాలెం సెంటర్ వద్ద ఆదివారం అరెస్ట్ చేశామని సీఐ రాంబాబు తెలిపారు. వారి నుంచి రూ.5.50 లక్షల నగదు, కిడ్నాప్‌కు ఉపయోగించిన నైలాన్‌తాడు, చాకు, స్కూటీ వాహనాన్ని స్వాధీనపర్చుకున్నామని ఆయన తెలిపారు. నిందితులను అడ్డతీగల జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచామని సీఐ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ అప్పలరాజు,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'కొత్తపల్లి'లో విదేశీ పర్యాటకులు



కొత్తపల్లి జలపాతానికి వచ్చిన విదేశీ పర్యాటకులు




సందడి చేస్తున్న విదేశీ చిన్నారులు


జి.మాడుగుల: మండలంలోని కొత్తపల్లి జలపాతం వద్ద ఆదివారం విదేశీ పర్యాటకులు సందడి చేశారు. వీకెండ్ కావడంతో ప్రత్యేక వాహనాల్లో సందర్శకులు తరలివచ్చారు. జలపాతంలో స్నానాలు చేశారు. రోజంతా ఉత్సాహంగా గడిపారు. విదేశీ పర్యాటకులకు ఎకో టూరిజం సూపర్‌వైజర్ వంతాల అభి, సిబ్బంది అవసరమైన సహకారం అందించారు.

మోదమ్మకు నీరాజనం

- ఇంటి పండగలతో సందడి
- పోటెత్తిన భక్తులు



మోదమ్మ ఇంటి పండగలో ఘటాలను తీసుకువెళ్తున్న భక్తులు



మోదమ్మ ఆలయ కమిటీ ప్రతినిధులకు విరాళం చెక్కును అందజేస్తున్న దర్శకుడు కార్తీక్‌వర్మ

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మతల్లి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు.అనేక ప్రాంతాలకు చెందిన భక్తులు భారీగా తరలిరావడంతో మధ్యాహ్నం వరకు మోదమ్మ ఆలయం రద్దీగా మారింది. మోదకొండమ్మ తల్లి దర్శనానికి భక్తులు గంటల తరబడి నిరీక్షించారు.ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత ప్రసాదాల పంపిణీని చేపట్టారు.

ఇంటి పండగల సందడి

మోదకొండమ్మతల్లికి మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు ఆదివారం ఇంటి పండగలు చేశారు.పాడేరు ఉప సర్పంచ్ బూరెడ్డి రామునాయుడు నిర్వహించిన ఇంటి పండగ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తీన్‌మార్, డప్పు వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. మట్టి ఘటాలను అమ్మవారికి భక్తిశ్రద్ధలతో సమర్పించారు. ఘాట్‌లోని మోదకొండమ్మతల్లి పాదాలు గుడికి కూడా భక్తులు భారీగా తరలివచ్చారు. ఇక్కడ కూడా ఇంటి పండగలు నిర్వహించారు.

విరూపాక్ష దర్శకుడి ప్రత్యేక పూజలు

విరూపాక్ష సినిమా దర్శకుడు దండు కార్తీకవర్మ కుటుంబ సమేతంగా ఆదివారం పాడేరు చేరుకుని మోదమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దయతో సినిమా సూపర్‌హిట్ అయిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలంనాయుడు, ఇతర కమిటీ ప్రతినిధులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. శాలువా కప్పి ఆయనను సత్కరించారు. దర్శకుడు కార్తీకవర్మతోపాటు మరో భక్తుడు మంతిన నాగరాజు వేర్వేరుగా ఆలయ అభివృద్ధికి రూ.10వేల చొప్పున విరాళాలను చెక్కు రూపంలో ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. అనంతరం స్థానిక ఉమా నీలకంఠేశ్వరస్వామి వారిని కూడా దర్శకుడు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఏడీఎంహెచ్‌వోగా భాస్కర్



రంపచోడవరం: ఏజెన్సీ అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్. భాస్కర్‌ను నియమిస్తూ డీఎంహెచ్‌వో ఉత్తర్వులు జారీ చేశారు. ఎల్లవరం పీహెచ్‌సీ వైద్యాధికారిగా పనిచేస్తున్న భాస్కర్‌ను ఏడీఎంహెచ్‌వోగా నియమించినట్టు ఆదివారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇప్పటి వరకూ ఏడీఎంహెచ్‌వోగా పనిచేసిన అనూష బదిలీ అయ్యారు.

ముమ్ముందు ఈ-సిటీ బస్సులే!

- దశల వారీగా విశాఖకు కేటాయింపు
- కాలం చెల్లిన బస్సుల స్థానంలో వీటికి చోటు
- డీజిల్ బస్సులకు క్రమంగా స్వస్తి



విద్యుత్ బస్సు

సాక్షి, విశాఖపట్నం : నగరాల్లో కాలుష్య తీవ్రత రోజురోజుకూ అధికమవుతోంది. పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, వాహనాల సంఖ్య ఇబ్బడి ముబ్బడిగా పెరుగుదల ఇందుకు కారణమవుతోంది. ఇలా కాలుష్యాన్ని వెదజల్లే డీజిల్ వాహనాలను నియంత్రించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. ఇందులోభాగంగా కాలుష్య కారక డీజిల్ ఆర్టీసీ బస్సుల స్థానంలో కాలుష్య రహిత విద్యుత్ బస్సులను ప్రవేశ పెడుతున్నాయి. వచ్చే ఐదేళ్లలో ఆర్టీసీ డీజిల్ బస్సులకు బదులు ఎలక్ట్రిక్ (ఈ) బస్సులను అందుబాటులోకి తీసుకురానున్నాయి.

తొలి దశలో విశాఖకు 100 కేటాయింపు : రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి కొత్తగా వెయ్యి ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేయనుంది. వీటిలో రాష్ట్రంలోనే అతి పెద్ద నగరమైన విశాఖకు 200 వరకు కేటాయించే అవకాశం ఉంది. తొలిదశలో 100 విద్యుత్ బస్సులు కేటాయించాలని గతంలోనే ఆర్టీసీ అధికారులు ఉన్నతాధికారులకు ప్రతిపాదించారు. విశాఖలో ప్రస్తుతం 525 సిటీ బస్సులున్నాయి. వాహనాల తుక్కు విధానంలో భాగంగా 15 ఏళ్ల దాటిన బస్సులను సేవల నుంచి తొలగిస్తున్నారు. ఇలా తొలగించిన డీజిల్ బస్సుల స్థానంలో దశల వారీగా ఈ-బస్సులను సమకూరుస్తారు.

పాలపుంతల్లా..


- ఉరకలేస్తున్న జలపాతాలు
- అనంతగిరిలో వెలుగులోకి వచ్చిన గొల్లగెడ్డ వాటర్‌ఫాల్



కనువిందు చేస్తున్న ఇనుపతీగల జలపాతం



ఆకట్టుకుంటున్న పిట్టలబొర్ర జలపాతం



కొండల నుంచి జారువారుతూ కనువిందు చేస్తున్న గొల్లగెడ్డ జలపాతం

అనంతగిరి: సహజ సిద్ధమైన ప్రకృతి అందాలు మన్యం సొంతం.. ఎటు చూసినా దట్టమైన అటవీ ప్రాంతం.. మరోపక్క ఆహ్లాదకరమైన వాతావరణంలో చెట్లు, ఎత్తయిన కొండల నడుమ జాలువారే జలపాతాలు ఎన్నో ఉన్నాయి. వీటిలో తాజాగా అనంతగిరి మండలంలో తాజాగా వెలుగుచూసింది గొల్లగెడ్డ జలపాతం. వాలసీ పంచాయితీ మద్దిగరువు గ్రామానికి అరకిలోమీటరు దూరంలో ఉంది.

- అరకు–విశాఖ ప్రధాన రహదారి ఆనుకుని ఉన్న డముకు నుంచి నిమ్మలపాడు తారురోడ్డులో 17 కిలోమీటర్లు ప్రయాణిస్తే రోడ్డు ఆనుకుని మద్దిగరువు గ్రామం కనిపిస్తుంది. అక్కడ నుంచి అర కిలోమీటరు పచ్చని పొలాల మధ్య నడుచుకుంటే వెళ్తే గొల్లగెడ్డ జలపాతం కనిపిస్తుంది.

అకట్టుకుంటున్న పిట్టలబొర్ర, ఇనుపతీగల..

పెదబయలు: ఎత్తయిన కొండల మధ్యలో జాలువారుతూ పాలపుంతలా పిట్టలబొర్ర జలపాతం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. మండలంలోని గిన్నెలకోట పంచాయతీ పిట్టలబొర్ర, తారాబు గ్రామాల మధ్యలో ఉన్న ఈ జలపాతం ఎగువ ప్రాంతంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఉరకలేస్తూ సుమారు 130 అడుగుల ఎత్తు నుంచి జాలువారుతూ కనువిందు చేస్తోంది. మండల కేంద్రానికి 45 కిలోమీటర్ల దూరంలో ఉంది.

ఇలా వెళ్లాలి..

పెదబయలు నుంచి కుజభంగి జంక్షన్ మీదుగా కుమడ వరకు ఆర్టీసీ బస్సు వెళ్తుంది. సుమారు 20 కిలోమీటర్ల తారురోడ్డు సదుపాయం ఉంది. గుంజివాడ మీదుగా జలపాతం సమీపం వరకు వాహనాల్లో వెళ్లవచ్చు. ద్విచక్ర వాహనాలు అయితే జలపాతం వరకు వెళ్లవచ్చు. ఇప్పుడు ముంచంగిపుట్టు మండలం బంగారుమెట్ట నుంచి గుల్లేలు జంక్షన్ మీదుగా చింతగరువు వరకు రోడ్డు సదుపాయం ఉంది. ఈ రోడ్డుకు సమీపంలో ఉన్న ఇనుపతీగల జలపాతం కూడా కనువిందు చేస్తోంది. ఈ మార్గంలో పిట్టలబొర్ర జలపాతానికి రెండు కిలోమీటర్ల దూరం వరకు వాహనాలు వెళ్తాయి. అక్కడి నుంచి కొద్దిదూరం నడవాల్సి ఉంటుంది. ఒడిశాలోని జాన్‌బాయ్ మీదుగా జామిగుడ సమీపం వరకు తారు రోడ్డు సదుపాయం ఉండడంతో ఎక్కువ మంది ఈమార్గంలో వెళ్తుంటారు.

పర్యాటకంగా అభివృద్ధి చేయాలి



పర్యాటక ప్రాంతంగా గొల్లగెడ్డ జలపాతాన్ని అభివృద్ధి చేసేందుకు ఐటీడీఏ, పర్యాటకశాఖ ముందుకు రావాలి. జలపాతం అభివృద్ధి చేస్తే అనేకమంది గిరిజన యువతకు ఉపాధి దొరుకుతుంది.

– సేంటీ సన్యాసిరావు, సర్పంచ్, వాలసీ

క్లుప్తంగా

టమాటాలతో తులాభారం

అనకాపల్లిటౌన్: పట్టణంలోని గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయ ఆవరణలో ఆదివారం వినూత్నరీతిలో తులాభారం నిర్వహించారు. వ్యాపారవేత్త మళ్ల జగ్గ అప్పారావు, మోహిని దంపతులు తమ కుమార్తె భవిష్యకు తులాభారం వేస్తామని అమ్మవారికి మొక్కుకున్నారు. టమాటాలు, బెల్లందిమ్మలు, పంచదార 51 కిలోల చొప్పున తులాభారం వేసి అమ్మవారికి సమర్పించారు. వీటితోపాటు జీడిపప్పు, కిస్మిస్ కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బండారు ప్రసాద్, ఆలయ అర్చకులు శ్రీను, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగు గంటలు ఆలస్యంగా కోరమండల్

తాటిచెట్లపాలెం : చెన్నై సెంట్రల్‌లో ఆదివారం ఉదయం 7గంటలకు బయల్దేరాల్సిన ఎంజీఆర్ చెన్నై సెంట్రల్– చెన్నై సెంట్రల్ (12842) కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ సుమారు నాలుగు గంటలు ఆలస్యంగా ఉదయం 10.45 గంటలకు బయల్దేరింది. అంతే ఆలస్యంగా ఆయా స్టేషన్‌లకు ఈ రైలు చేరుకోనుంది.

బాల్ బ్యాడ్మింటన్ కోచ్ పోలిరెడ్డికి సత్కారం


పోలిరెడ్డిని అభినందిస్తున్న అధికారులు

మహారాణిపేట : బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలకు కోచ్‌గా నియమితులైన బుల్లయ్య కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ పి.పోలిరెడ్డిని ఆదివారం పలువురు అధికారులు పోర్టు స్టేడియంలో సన్మానించారు. ప్రపంచ ఇంటర్ యూనివర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఇండియన్ యూనివర్సిటీ జట్టుకు కోచ్ కమ్ మేనేజర్‌గా పోలిరెడ్డి నామినేట్ అయ్యారు. ఆగస్టు 8వ తేదీ నుంచి చైనాలో జరగనున్న పోటీలకు పోలిరెడ్డి కోచ్‌గా వ్యవహరిస్తారు. ఈ సందర్భంగా ఆదివారం కలెక్టరేట్ నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్(ఎన్ఐసీ) అధికారి భాష, ఏసీపీ శ్రీనివాస్, పోర్టు అధికారి కుమార్ రాజా తదితరులు పోలిరెడ్డిని సత్కరించారు.

సర్కారు వైద్యం.. పేదలకు వరం

- వై.రామవరం సీహెచ్‌సీలో రోజురోజుకు పెరుగుతున్న ఓపీ
- అందుబాటులో వైద్యాధికారులు, సిబ్బంది
- నిర్విరామంగా సేవలు


వై.రామవరంలో సామాజిక ఆరోగ్య కేంద్రం

వై.రామవరం: నాడు పేదలకు సరైన వైద్యం అందడం గగనంగా ఉండేది.. టీడీపీ హయాంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు దారుణంగా దర్శనమిచ్చేవి.. అరకొర సదుపాయాలు.. సక్రమంగా అందని వైద్యంతో రోగులు పడిన కష్టాలు వర్ణనాతీతం. గత్యంతరం లేక రోగులు అప్పులు చేసి ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించేవారు..అదంతా గతం.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలు మారిపోయాయి. పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. సర్కారు ఆస్పత్రుల్లో కార్పొరేట్‌కు దీటుగా వైద్య సేవలకు శ్రీకారం చుట్టారు. ఇందుకోసం సర్కారు ఆస్పత్రుల్లో అధునాతన వైద్య సదుపాయాలతో పాటు నిపుణులైన వైద్యులను అందుబాటులో ఉంచారు. ప్రజలకు వైద్య సేవలందించే నిలయాలుగా ప్రభుత్వ ఆస్పత్రులు మారాయి.

మెరుగైన వైద్యం.. ఆనందంలో గిరిజనం

మండల కేంద్రంలోని సీహెచ్‌సీ రోజూ రోగులతో కిటకిటలాడుతుంటుంది. సరిహద్దు మండలాల నుంచి కూడా గిరిజనులు వైద్యం కోసం తరలివస్తుంటారు. ఆస్పత్రిలో ఉన్న 30 పడకలు నిత్యం రోగులతో నిండి ఉంటుంది. రోజూ ఓపీ 170 మందికి పైగా నమోదవుతుంది. ఇందుకు ప్రధాన కారణం ఇక్కడ అందుతున్న మెరుగైన వైద్యం.. నిర్విరామంగా వైద్యాధికారులు, సిబ్బంది అందిస్తున్న సేవలే తార్కాణం..

స్థానిక సీహెచ్‌సీకి వై.రామవరం మండలానికి చెందిన రోగులే కాకుండా, సరిహద్దు మండలాల్లో ఆసుపత్రులు ఉన్నప్పటికీ అడ్డతీగల, కొయ్యూరు మండలాలకు చెందిన రోగులు విపరీతంగా వచ్చి వైద్యసేవలు పొందుతున్నారు. రోగులకు 24 గంటలు నిర్విరామంగా వైద్యసేవలు అందిస్తు వైద్యాధికారులు సిబ్బంది క్కిరిబిక్కిరవుతున్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

వై.రామవరం సీహెచ్‌సీని 50 పడకల ఆసుపత్రిగా మార్చే దిశలో ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. ఇందులో భాగంగా ఆస్పత్రి అభివృద్ధికి ప్రభుత్వం రూ.1.50కోట్ల నిధులు మంజూరు చేసింది. దీంతో ఆస్పత్రి రెండో అంతస్తు నిర్మాణంతో పాటు అదనపు గదులు, ఇన్‌పేషెంటు వార్డులు, తదితర అభివృద్ధి పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. 24 గంటలు సేవలందిస్తున్న ఆస్పత్రిలో అన్ని రక్తపరీక్షలు చేసే ల్యాబ్, స్కానింగ్ మిషన్లు, ప్రతీ వార్డుకు సరఫరా చేసే ఆక్సిజన్ ప్లాంటు, ఇన్వర్టర్లు, జనరేటర్లు, మినరల్ వాటర్‌ప్లాంటు, తగినంతమంది సిబ్బంది తదితర అన్ని సౌకర్యాలు ఉన్నాయి. నూతన ఎక్సరే ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నారు. ముగ్గురు వైద్యాధికారులు 24 గంటల్లో సేవలు అందిస్తున్నారన్నారు. ఆస్పత్రిలో శిశువుల కోసం ప్రత్యేక ఎస్ఎన్‌సీయూ వార్డుతో పాటు చిన్నపిల్లల వైద్యం కోసం కూడా ప్రత్యేక వార్డులున్నాయి. వార్డులో చిన్నపిల్లలకు వెంటిలేటర్స్, ఆక్సిజన్, ప్రత్యేక వైద్యాధికారి, సిబ్బంది, తదితర అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పించింది. పాముకాటుకు, కుక్క కాటుకు వ్యాక్సిన్ కూడా అందుబాటులో ఉంది. ఆసుపత్రిలోనే ప్రసవాలు చేసి, తల్లీబిడ్డలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైఎస్సార్ తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్‌లో సురక్షితంగా ఇంటికి చేరుస్తున్నారు. ఆసుపత్రి సామర్థ్యాన్ని మించి ఎంతమంది రోగులు వస్తున్నా తాము సేవలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేదల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించిన సకల సౌకర్యాలను, అందుబాటులో ఉన్న అన్ని రకాల సేవలను, మందులను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్ కోరుతున్నారు.


ఇన్‌పేషెంటు వార్డులో వైద్య సేవలందిస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

వైద్య సేవలు బాగున్నాయి



మాకు వై.రామవరం సీహెచ్‌సీలో మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. అందుకు మేము సరిహద్దు మండలం నుంచి వై.రామవరం ప్రభుత్వాసుపత్రికి వచ్చాం. ఇన్‌పేషెంటు వార్డులో చికిత్స పొందుతున్నాను. నా ఆరోగ్యం మెరుగుపడింది.

– బోనంగి సింహాచలం, తీతురాళ్ల గ్రామం, కొయ్యూరు మండలం

కార్పొరేట్‌కు మించిన వైద్యం



ఇక్కడి సీహెచ్‌సీలో కార్పొరేటు ఆస్పత్రులకు మించిన వైద్యసేవలు అందుతున్నాయి. అందుకే ఈ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి వైద్యసేవలు పొందుతున్నాం.ఆస్పత్రుల్లో బెడ్‌లు మరిన్ని పెంచితే బాగుంటుది

– జర్త రాజేశ్వరి, చినవడిసికర్ర గ్రామం, అడ్డతీగల మండలం

సౌకర్యాలు భేష్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యసేవలు, సౌకర్యాలు భేష్‌గా ఉన్నాయి. వై.రామవరం సీహెచ్‌సీలో వైద్యాధికారులు, సిబ్బంది మరింత మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు. అన్ని మందులు, రక్త పరీక్షలు అందుబాటులో ఉన్నాయి.

– సమర్త దుర్గాదేవి, రాయపల్లి గ్రామం, అడ్డతీగల మండలం

సేవలకు విశేష కృషి



వార్డుల్లో ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించింది. వైద్యులు, సిబ్బంది సమష్టిగా పనిచేసి మెరుగైన సేవలకు విశేష కృషి చేస్తున్నాం. ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తాం.

– డాక్టర్ ఉమ మధులత

అందుబాటులో అన్ని రకాల సేవలు



ఇన్‌పేషెంటు వార్డులో 30 పడకలే ఉన్నప్పటికీ పేదలకు సేవలందించడం ఒక వరంగా భావించి వైద్యం అందిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఐటీడీఏ పీఓ సూరజ్ గనోరే సహాయ సహకారాలతో ఎంతమంది రోగులు వచ్చినా వైద్యసేవలు అందిస్తున్నాం. పేద గిరిజనులను మరో ప్రాంత ఆస్పత్రికి రిఫర్ చేయకుండా సేవలందిస్తున్నాం. అన్ని మందులు రక్త పరీక్షలు అందుబాటులో ఉన్నాయి.

– డాక్టర్ రాహుల్, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, వై.రామవరం

పర్యాటకులను కాపాడిన లైఫ్‌గార్డ్స్


దీపక్‌తో లైఫ్‌గార్డ్స్


యువకుడ్ని తీరానికి తీసుకొచ్చిన లైఫ్ గార్డ్స్

కొమ్మాది/బీచ్ రోడ్డు : రుషికొండ బీచ్, ఆర్కేబీచ్‌లో స్నానమాచరిస్తూ కెరటాల ఉధృతికి కొట్టుకుపోతున్న ఇద్దరు యువకులను లైఫ్ గార్డ్స్ రక్షించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన నలుగురు యువకులు ఆదివారం రుషికొండ బీచ్‌కు వచ్చారు. సాయంత్రం స్నానాలు చేసేందుకు ఇద్దరు బీచ్‌లోకి దిగారు. వీరిలో రామ్ అవతార్ ఉధృతంగా వచ్చిన అలలకు చిక్కుకుపోయాడు. లైఫ్‌గార్డ్స్ సూరాడ నూకరాజు, మైలిపిల్లి చందు అప్రమత్తమై అవతార్‌ను రక్షించారు. అలాగే ఒడిశాకు చెందిన దీపక్ ఆర్కేబీచ్‌లో కెరటాల ఉధృతికి కొట్టుకుపోయాడు. స్థానికులు పెద్దగా అరవడంతో బీచ్ లైఫ్ గార్డ్స్ నవీన్, పోలీరాజు, ధనరాజులు దీపక్‌ను కాపాడారు. ప్రథమ చికిత్స అనంతరం కేజీహెచ్‌కు తరలించారు.

జాబ్‌కార్డుదారులందరికీ ఉపాధి పనులు

- డ్వామా పీడీ రమేష్‌రామన్ అధ్యక్షతన ప్రజావేదిక
- రూ.14.54 కోట్ల విలువైన పనుల వివరాలు వెల్లడి


ప్రజావేదికలో పాల్గొన్న డ్వామా పీడీ రమేష్‌రామన్ తదితరులు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయ ఆవరణలో ఆదివారం విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక జరిగింది. ఈ కార్యక్రమానికి డ్వామా పీడీ రమేష్‌రామన్ అధ్యక్షత వహించారు. మండల పరిధిలోని 19 పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద 2022 ఏప్రిల్ ఒకటి నుంచి మార్చి 31, 2023 వరకు జరిగిన 1,035 పనులకు రూ. 14.53 కోట్ల మేర అయిన ఖర్చులకు సంబంధించి ప్రజావేదిక నిర్వహించారు. గ్రామాల వారీగా జరిగిన ఉపాధి పనులను సమీక్షించారు. ఆడిటర్లు చాలా చోట్ల కొలతల్లో తేడాలు గమనించగా వాటిని వెంటనే సరిదిద్దేందుకు ఉపాధి సిబ్బంది నడుంబిగించారు. కాగా సిబ్బంది నిర్లక్ష్యం ఉన్న చోట రూ. 4,009 రికవరీకు ఆదేశించినట్లు పీడీ వెల్లడించారు. మరో రూ. 2వేల మేర ఫైన్ విధించామన్నారు.

ఎంపీపీకు అందని ఆహ్వానం

రాజవొమ్మంగిలో 16వ తేదీ ఆదివారం జరుగనున్న సామాజిక తనిఖీ ప్రజావేదికకు స్థానిక ఎంపీపీను ఆహ్వానించకపోవడాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేష్‌రాజు డ్వామా పీడీ రమేష్‌రామన్ దృష్టికి తీసుకొని వచ్చారు. సంభందిత ఉపాధిహామీ కార్యాలయ ఏపీఓపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై డీఆర్వో బి.నిర్మలాదేవి మాట్లాడుతూ ప్రజావేదిక కార్యక్రమంలో ఇటువంటి ఆరోపణలు రావడం విచారకరమన్నారు. ఈ దఫా ప్రజాప్రతినిధులను ఆహ్వానించినప్పుడు వారిచే ఆహ్వానపత్రిక అందినట్టుగా రిజిస్టర్‌లో సంతకాలు కూడా తీసుకోవాలని ఏపీఓ సురేష్‌కుమార్‌ను ఆదేశించారు.

మెరుగుపడిన సిబ్బంది పనితీరు

గతంలో కంటే ఈ దఫా జరిగిన ప్రజావేదికలో సిబ్బంది తీరు మెగరుపడినట్టు కనుపిస్తోందని డ్వామా పీడీ రమేష్‌రామన్ కితాబు ఇచ్చారు. పనితీరు మెరు మరికొంత మెరుగుపరచుకొంటే ప్రమోషన్లకు సిఫార్సు చేస్తామన్నారు. మండలంలో ఏడాదిలో కనీసం పది లక్షల పనిదినాలు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి జాబ్‌కార్డుకు వంద రోజుల పని తప్పనిసరిగా కల్పించాలన్నారు. ఏపీవో వై.వెంకటేశ్వర్లు, ఎంపీడీవోలు కె.బాపన్నదొర, ఎల్.యాదగిరీశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విద్యతోనే బీసీలకు గౌరవం

- సీఎం జగన్ గొప్ప సంఘ సంస్కర్త
- దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏపీలో బీసీల అభ్యున్నతి
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య
- ఘనంగా విశాఖ బీసీ గర్జన


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, మంత్రి వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి తదితరులు

బీచ్‌రోడ్డు : బీసీల అభ్యున్నతి, ఆత్మ గౌరవం అనేది విద్యతోనే సాధ్యమౌతుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సంఘం అధికార ప్రతినిధి కర్రి వేణుమాధవ్ ఆధ్వర్యంలో ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం 'విశాఖ బీసీ గర్జన' నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ ఒక సామాజిక వర్గం అభివృద్ధి చెందాలంటే విద్య, రాజకీయ, ఆర్థిక రంగాల్లో ప్రగతి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. దానికి ప్రభుత్వాల చేయూత కూడా అవసరమన్నారు. బీసీలకు సముచిత స్థానం కల్పించింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని స్పష్టం చేశారు. గతంలో ఏ ముఖ్యమంత్రి బీసీలను పట్టించుకోలేదన్నారు. విద్య,రాజకీయ, ఆర్థికంగా ఎదగాలని చెప్పిన గొప్ప నాయకుడు జగన్ అని కొనియాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంఘ సంస్కర్త కావడంతో అన్ని వర్గాల అభ్యున్నతి చెందుతున్నాయన్నారు. ముఖ్యంగా బీసీలకు చట్టసభల్లో అధిక ప్రాధాన్యత కల్పించారన్నారు. అప్పట్లో వైఎస్ రాజశేఖర రెడ్డి, ఇప్పుడు ఆయన తనయుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బీసీల ఉన్నత చదువుల కోసం ప్రత్యేక పథకాలను ప్రవేశపెట్టారన్నారు. చాలా రాష్ట్రాల్లో తాను పర్యటించానని, బీసీ వర్గాలకు చెందిన పిల్లలు స్కూల్స్‌కు దూరంగా ఉంటున్నారన్నారు. ఏపీలో మాత్రం ప్రతీ ఒక్కరికీ విద్యను అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. జాతీయ స్థాయిలో బీసీలు సాధించాల్సిన అంశాలు చాలా ఉన్నాయని వాటిపై పోరాడతామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి హాజరయ్యారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో బీసీలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు.

బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్లాస్ కాదు.. బ్యాక్‌బోన్

బీసీలంటే బ్యాక్‌వార్డ్ క్లాస్ కాదు బ్యాక్‌బోన్ అని చెప్పిన గొప్ప సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కృష్ణయ్య పేర్కొన్నారు. అన్ని రంగాల్లో బీసీలకు సముచిత అవకాశం కల్పిస్తున్నట్టు రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ చెప్పారు. 1997 నుంచి 2004 మధ్య కాలంలో బీసీల ఉన్నత చదువులకు చంద్రబాబు దూరం చేశారన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రవేశపెట్టడంతో లక్షాలాది మంది బీసీలు బీటెక్‌లు పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడ్డారన్నారు. అదే బాటలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి అనేక పథకాలను ప్రవేశపెట్టారన్నారు. అనంతరం బీసీ కమిషన్ మాజీ సభ్యుడు పక్కి దివాకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంతకుముందు వైఎస్సార్ విగ్రహం నుంచి బీసీ నేతలంతా ఆర్.కృష్ణయ్యను ఊరేగింపుగా సభా ప్రాంగణానికి తీసుకొచ్చారు. కరోనా కాలంలో ఇంటింటికీ వెళ్లి సేవ చేసిన వలంటీర్లకు బీసీ సంక్షేమ సంఘం వందనం చేసింది. వలంటీర్ల వ్యవస్థతో బీసీ వర్గాలకు పథకాలు ఇంటికే చేరుతున్నాయని, అటువంటి సేవకులను ప్రతీ ఒక్కరూ గౌరవించాలని కోరారు.

శ్రీనుకు బంగారు పతకం

తుమ్మపాల: శ్రీకాకుళం జిల్లా రాజాం జీఎంఆర్ ఐటీలో ఈ నెల 12 నుంచి 16 వరకు జరిగిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పట్టణానికి చెందిన ఎం.శ్రీను బంగారు పతకం సాధించినట్టు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు నీలా, కార్యదర్శి బద్రీనాథ్ తెలిపారు. పట్టణంలో ఎస్‌కేపీ జిమ్‌లో కోచ్ వసాది నానాజీ వద్ద శిక్షణ పొందిన శ్రీను మాస్టర్స్ పురుషుల 59 కిలోల విభాగంలో ప్రథమ స్థానం సాధించారాన్నరు. ప్రస్తుతం శ్రీను వయస్సు 50 సంవత్సరాలని తెలిపారు. శ్రీను జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో అనేక పతకాలు సాధించారని, ఇప్పుడు జాతీయ స్థాయిలో విజయం సాధించడంపై అభినందనీయమన్నారు.

దిగులు పడకురా సహోదరా

- మానసిక రోగులకు మెరుగైన వైద్యసేవలు
- సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా ప్రభుత్వ మానసిక ఆస్పత్రి
- సిద్ధమైన అకడమిక్ బ్లాక్
- నూతనంగా మూడు కోర్సులు


నిర్మించిన నూతన వార్డులు



నూతనంగా నిర్మించిన అకడమిక్ బ్లాక్

ఏయూక్యాంపస్ : అధునాతన వైద్య సేవలు అందించే దిశగా ప్రభుత్వ మానసిక ఆస్పత్రి మరో ముందడుగు వేస్తోంది. నూతనంగా ఏర్పాటైన సెంటర్ ఆఫ్‌ఎక్స్‌లెన్స్‌తో సమర్థవంతమైన సేవలను రోగులకు అందించే దిశగా సమాయత్తమవుతోంది. రాష్ట్రానికే తలమానికంగా నిలుస్తున్న పెదవాల్తేరులోని ప్రభుత్వ మానసిక ఆస్పత్రి స్వరూపం పూర్తిగా మారి రోగులకు మరింత విస్తృత సేవలు అందించే దిశగా సెంటర్ ఆఫ్‌ఎక్స్‌లెన్స్ నిలవనుంది. నూతనంగా మూడు కోర్సులతో అదనపు బోధన సిబ్బంది సమకూరనున్నారు.

రూ.29 కోట్లతో అకడమిక్ బ్లాక్

కేంద్ర ప్రభుత్వం విశాఖలోని దశాబ్దాల చరిత్ర కలిగిన ప్రభుత్వ మానసిక ఆస్పత్రిని సెంటర్‌ఆఫ్‌ఎక్స్‌లెన్స్‌గా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా రూ.29 కోట్లతో అకడమిక్ బ్లాక్, ఇతర వార్డులను నిర్మించారు. దీనిలో కేంద్ర ప్రభుత్వం వాటా 60 శాతం కాగా, రాష్ట్ర ప్రభుత్వ వాటా 40 శాతంగా ఉంది. ఇప్పటికే భవనాల నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధమయ్యాయి. కొద్ది రోజుల్లో ఇవి పూర్తిస్థాయిలో సేవలు అందించనున్నాయి.

మూడు కోర్సులు ప్రారంభం

అకడమిబక్ బ్లాక్ నిర్మాణం పూర్తికావడంతో సెంటర్ ఆఫ్‌ఎక్స్‌లెన్స్‌లో భాగంగా క్లినికల్ సైకాలజీ, సైక్రియాట్రిక్ సోషల్‌వర్క్, సైక్రియాట్రిక్ నర్సింగ్ కోర్సులను ప్రారంభించనున్నారు. ఒక్కో కోర్సులో గరిష్ఠంగా 30 మందికి ప్రవేశం కల్పిస్తారు. కోర్సుల నిర్వహణకు అవసరమైన ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాల భర్తీ త్వరలో జరగనున్నాయి. దాదాపు 19 మంది వరకు బోధన సిబ్బంది, క్లినికల్ సైకాలజీ ల్యాబ్ అసిస్టెంట్, లైబ్రేరియన్, సైక్రియాట్రి సోషల్ వర్కర్ వంటి ఉద్యోగాలు భర్తీ కావాల్సి ఉంది. వీటిని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ భర్తీ చేస్తుంది. ప్రస్తుతం మానసిక ఆస్పత్రిలో నిర్వహిస్తున్న ఎం.డి సైక్రియార్టీ కోర్సుకు అదనంగా ఈ మూడు కోర్సులు రావడంతో మరింత బలోపేతం కానుంది.

మానసిక రుగ్మతల నివారణకు..

ప్రజల్లో పెరుగుతున్న మానసిక సమస్యలు, రుగ్మతల నివారణకు ఉపయుక్తంగా నూతన అకడమిక్ బ్లాక్ సేవలు అందించనుంది. దీనిలో ప్రత్యేకంగా డీ అడిక్షన్ విభాగం మత్తుపదార్థాలకు బానిసైన వారికి వైద్య సేవలు అందిస్తారు. ఈ వార్డును 40 బెడ్‌లతో ఏర్పాటు చేస్తున్నారు. చిన్నారుల్లో మానసిక సమస్యలు గుర్తించి సత్వరం చికిత్స, ఉపశమనం అందించే విధంగా చైల్డ్ సైక్రియార్టీ సేవలు 20 బెడ్‌లతో సిద్ధం చేస్తున్నారు. వృద్ధుల్లో వచ్చే మానసిక సమస్యలకు సైతం చికిత్స అందించే విధంగా జిరియార్టిక్ సైక్రియార్టీ వార్డ్‌ను ప్రత్యేకంగా 20 బెడ్‌లతో ఏర్పాటు చేస్తున్నారు. దీని వలన 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు సైతం ఇన్‌పేషెంట్‌గా చేర్చుకుని చికిత్స అందించే అవకాశం ఏర్పడుతుంది.

మనోవికాస్..నూతన జీవితం

స్వల్పమానసిక సమస్యలు కలిగిన వారికి నూతన జీవితాన్ని అందించడం, సాధారణ జీవితం గడిపే విధంగా మనో వికాస్ విభాగం ఏర్పాటు అవుతోంది. దీనిలో భాగంగా మానసిక రోగులకు ఇది డే కేర్ సెంటర్‌గా నిలుస్తుంది. దీనిలో వారి సామర్థ్యాలకు అనుగుణంగా పేపర్ ప్లేట్లు తయారీ, బొమ్మల తయారీ, టైలరింగ్, క్యాండిల్స్ తయారీ వంటి అంశాలలో శిక్షణ ఇస్తారు. వాటిని విక్రయించగా వచ్చే లాభంతో కొంత వారికి అందిస్తారు.

పేరుమార్పుకు ప్రతిపాదన

మానసిక ఆస్పత్రి అనగానే ప్రజల్లో ఉండే భయాన్ని రూపుమాపడానికి ఆ పేరును మార్చే ప్రతిపాదన ప్రభుత్వానికి పంపారు. వాల్తేర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూరోలాజికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ సెంటర్ (విన్స్–ఆర్‌సీ)గా పేరును మార్పు చేయడానికి ప్రతిపాదన చేశారు. మానసిక ఆస్పత్రికి వచ్చామనే భావన రూపుమాపుతూ వారికి స్వాంతన అందించే విధంగా దీనిని తీర్చిదిద్దే దిశగా కృషిచేస్తున్నారు.

పూర్తిస్థాయిలో చికిత్సలు



వివిధ మానసిక సమస్యలతో ఇబ్బందుతు పడుతున్న వారికి అవసరమైన పూర్తి స్థాయి చికిత్స అందించి, వారికి స్వాంతన అందించడం లక్ష్యంగా పనిచేస్తున్నాం. నూతనంగా ఏర్పాటయ్యే సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ దీనిని సాకారం చేస్తుంది. మానసిక సమస్యను త్వరితగతిన గుర్తించడం, చికిత్స అందించడం, కౌన్సెలింగ్ ఇవ్వడం వంటి ప్రక్రియలు అందుబాటులోకి రానున్నాయి.

– డాక్టర్ కేవీ రామి రెడ్డి, సూపరింటెండెంట్, ప్రభుత్వ మానసిక ఆస్పత్రి